క్లుప్తంగా

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు మంజూరు చేయాలి

కంచికచర్ల: వేసవికాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులకు కూలీలకు సకాలంలో వేతనాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. మండలంలోని బత్తినపాడు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి గ్రామాల్లో బుధవారం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలో పనిచేసే కార్మికులకు షామియానాలు ఏర్పాటు చేయటంతో పాటు మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు. పనిచేసే సమయంలో వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నందిగామ: ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎస్.నరసింహారావు సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏడీఏ రమణమూర్తితో కలిసి నియోజకవర్గ పరిధిలోని ఏవోలతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలు, రైతుల వద్ద కొనుగోలు చేయవలసిన పంటలు, తదితర అంశాలపై చర్చించారు.

కొనసాగుతున్న ఎడ్ల బండ లాగుడు ప్రదర్శన

నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం రాత్రి ఆరు పళ్ల విభాగంలో జరిగిన పోటీలలో పలు ప్రాంతాలకు చెందిన 10 జతల ఎడ్లు పాల్గొన్నాయి. 12 క్వింటాళ్ల బరువు ఉన్న బండను 15 నిమిషాల వ్యవధిలో లాగే దూరాన్ని బట్టి విజేతలను నిర్ణయిస్తారు. ఈ క్రమంలో రాత్రి పొద్దుపోయే వరకు ఈ ప్రదర్శన కొనసాగింది.

ముగిసిన తిరునాళ్ల మహోత్సవాలు



నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి విశేష పూజలతో పాటు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయేవరకు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.

రహదారి మరమ్మతు పనుల పరిశీలన

కంచికచర్ల: కంచికచర్ల నుంచి పెద్దాపురం వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు మరమ్మతు పనులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అధికారులు, నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ అండ్బీ రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రభుత్వం రూ.18 కోట్ల నిధులు మంజూరు చేసిందని, 99 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. మిగిలిన 1 శాతం పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయాయని అన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్మోహన్రెడ్డి ఒక పక్క ప్రజల సంక్షేమం చేస్తూ మరో పక్క అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని జాతీయ రహదారులన్నీ సీఎం జగన్ వల్లే అభివృద్ధి జరిగాయన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా నాయకులు ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి వేమా సురేష్బాబు, విద్యుత్శాఖ ఏఈ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు శేషం వాసుబాబు, కోయా సుబ్రహ్మణ్యం, మంగినేని శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, గ్రంధి ఆదిత్య, ఆర్అండ్బీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా

- ముప్పాళ్లలో రూ.60 లక్షలతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్మోహనరావు



విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

నందిగామటౌన్: విద్యుత్ వినియోగదారుల అవసరానికి తగినట్లు పూర్తి స్థాయిలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో నూతనంగా చేపడుతున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సమస్య పరిష్కారానికే రూ.60 లక్షల వ్యయంతో 6 ఎంవీఏ సామర్థ్యం కలిగిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సబ్స్టేషన్ నిర్మాణం వల్ల ముప్పాళ్లతో పాటు గుత్తావారిపాలెం, అడవిరావులపాడు, కేతవీరునిపాడు, మునగాలపల్లి గ్రామాలలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దాంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు.

పుష్కలంగా విద్యుత్ సరఫరా..

వ్యవసాయ భూములతో పాటు ఈ ప్రాంతంలోని పారిశ్రామిక కేంద్రాలకు పుష్కలంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు జగన్మోహనరావు చెప్పారు. గతంలో లో వోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అవాంతరాలపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందాయన్నారు. దీని దృష్ట్యా విద్యుత్ సబ్స్టేషన్ ఆవశ్యకతను ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి విద్యుత్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేశారని తెలిపారు. గతంలో ముప్పాళ్ల పరిసర గ్రామాలకు చందర్లపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా చేయటంతో ఇబ్బందులు తలెత్తేవని, కానీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్తో ఆ ఇబ్బందులకు చెక్ పెట్టవచ్చని తెలిపారు.

స్థల దాతలకు సత్కారం

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని వితరణగా ఇచ్చిన దాతలు వంకాయలపాటి అంకమ్మరావు, ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే జగన్మోహనరావు ఘనంగా సత్కరించారు. సబ్స్టేషన్ ఏర్పాటులో చురుకుగా పని చేసిన విద్యుత్ శాఖాధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఈఈ భార్గవ శ్రీనివాసరావు, ఏడీఈ రమేష్బాబు, ప్రభు, ఏఈ పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు నల్లాని రమాదేవి, సొసైటీ చైర్మన్ నల్లాని అయ్యన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, బండారుపల్లి కపిల్, వేల్పుల ప్రసాద్, ఉసికల వెంకట్రావ్, కొణకంచి వెంకట్రావ్, చందు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఉదయభానుకు ఆహ్వానం



విప్ ఉదయభానుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ రమేష్నాయుడు

పెనుగంచిప్రోలు: విజయవాడ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి మహాయజ్ఞానికి ఆహ్వానిస్తూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓ కె. రమేష్నాయుడు బుధవారం జగ్గయ్యపేటలో ఆహ్వానపత్రిక అందజేశారు. రాష్ట్ర ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాల కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 17 వరకు ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు.

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్కు..

పెనుగంచిప్రోలు: విజయవాడలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి ఆహ్వానిస్తూ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుకు బుధవారం రాత్రి జగ్గయ్యపేటలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓ కె. రమేష్నాయుడు ఆహ్వానపత్రిక అందజేశారు.

నాలుగేళ్లలో ఊహకందని సంక్షేమం

గడప గడపలో ఎమ్మెల్యే జగన్మోహనరావు



పెద్దాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఊహకందని రీతిలో రెండు లక్షల కోట్ల రూపాయలను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమ చేశారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాలు అమలు తేదీలతో కూడిన క్యాలెండర్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 87 శాతం గృహాలకు సంక్షేమ పథకాల ద్వారా మంచి చేశామన్నారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించటంతో పాటు గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జగన్మోహనరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని విస్మరిస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి మాత్రం చెప్పిన వాటితో పాటు చెప్పనివి కూడా చేసి చూపిస్తున్నారని కొనియాడారు.

ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం

మంచి చేస్తున్నాం కాబట్టే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్న తమకు ఆయా గ్రామాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని జగన్మోహనరావు తెలిపారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కంచికచర్ల గ్రంథపాలకుడు రామచంద్రుడు



కంచికచర్ల గ్రంథాలయంలో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్న యోగా ఉపాధ్యాయురాలు

కంచికచర్ల: వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ శాఖ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మూడవ రోజు బుధవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు వేసవి విజ్ఞాన సదస్సులు జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా కార్యక్రమాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులకు తెలుగు వ్యాకరణం అంశాలను తెలుగు ఉపాధ్యాయుడు డి. నాగేశ్వరరావు వివరించారు. అలాగే విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రాఫ్ట్స్ నేర్పించారు. యోగా టీచర్ లీలావతి యోగాసనాలు, చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ చిత్రలేఖనంలో మెలకువలను నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది జె.శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఈ-కేవైసీ తప్పనిసరి



పేటలోని సబ్ ట్రెజరీ ఆఫీసును పరిశీలిస్తున్న డీటీఏవో రెహమాన్

జగ్గయ్యపేట అర్బన్: విశ్రాంత ఉద్యోగులంతా తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించాలని ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎంహెచ్ రెహమాన్ తెలిపారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జగ్గయ్యపేట సబ్ ట్రెజరీ ఆఫీసును ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎంహెచ్ రెహమాన్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రిజిస్టర్ల పరిశీలించారు. సిబ్బందిని పనితీరుపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని పోస్టాఫీసు వద్ద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పేట శాఖ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధరణికోట పెన్షనర్స్ భవన్లో ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్ సంఘాల సభ్యులు డీటీఏవో రెహమాన్ను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. అనంతరం ఆయా సంఘాల సభ్యులు విడివిడిగా ఆయనను ఘనంగా సన్మానించారు. సబ్ ట్రెజరీ అధికారి(ఎస్టీవో) ప్రఫుల్లకుమార్, సబ్ ట్రెజరీ అధికారులు మల్లేశ్వరరావు, సతీష్, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్-2023



పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న పరిశీలకులు

నందిగామ: పాలిసెట్ బుధవారం పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. నందిగామ ప్రాంతంలోని విద్యార్థుల కోసం మొత్తం ఆరు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆరు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1531 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, 1364 మంది మాత్రమే హాజరైనట్లు నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. 167 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 777 మంది బాలురు, 587 మంది బాలికలు పరీక్ష రాసినట్లు చెప్పారు. మొత్తం మీద 89.09 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగింది. నిమిషం నిబంధన అమలులో ఉండటంతో దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు బి.నాగేశ్వరరావు, సంజీవరావు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. భానుడి ప్రతాపాన్ని దృష్టిలో పెట్టుకొని రాసే విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్



బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాన్సన్, అరవ రమేష్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తల్లిదండ్రులకు అవగాహన లేక 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు జరిపిస్తున్నారని, అది చట్టరీత్యా నేరమని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జాన్సన్ పేర్కొన్నారు. బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సమగ్ర బాలల సంరక్షణ పథకం (డీసీపీయూ), స్థానిక వార్డ్ సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది సహకారంతో పశ్చిమ నియోజకవర్గం పెజ్జోనిపేటలోగల ఆర్సీఎం దేవాలయం ఆవరణలో చైల్డ్లైన్, ఫోరం ఫర్ చైల్డ్రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ జరిగింది. సమ్మర్ క్యాంప్లోని బాలల కోసం 'బాలల హక్కుల పరిరక్షణ – అందరి పాత్ర' అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాన్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలబాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాలలు ఆపదలో ఉంటే వెంటనే చైల్డ్లైన్ – 1098 లేదా డయల్ 100, ఉమెన్ హెల్ప్లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. చైల్డ్లైన్ – 1098 జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు లేని సమాజాన్ని అందరం కలిసి నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న బాలలకు అండగా చైల్డ్లైన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కరోనా తరువాత బాలల స్థితిగతులు మారాయని, కొంత మంది అవగాహన, చైతన్య లేక మొబైల్ ఫోన్, మత్తు పదార్థాలకు బానిసలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి కాకుండా పనుల్లోకి పంపించడం వల్ల బాలలు బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. బాలలు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలల హక్కుల పరిరక్షణపై ఆర్సీఎం చర్చి డైరెక్టర్ ఫాదర్ జేమ్స్, బర్డ్స్ ఎన్జీఓ సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైల్డ్లైన్ సెంటర్ కో ఆర్డినేటర్ నాగరాజు టీమ్ సభ్యులు అబ్రహాం, ప్రవీణ్, స్వరూప, స్థానిక సచివాలయ మహిళా పోలీసు మెర్సీ, సమ్మర్ క్యాంప్ ఇన్చార్జ్ బ్రదర్ అశోక్, విజయవాడ పోలీస్ డిపార్ట్మెంట్లోని బాలల అక్రమ రవాణా యూనిట్ అధికారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చైతన్య గీతాలను వినిపించారు.

అసాంఘిక శక్తులను అణచివేయండి

- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్కుమార్
- ఏడు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్లో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఉంచి అణచివేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్కుమార్ ఆదేశించారు. ఏలూరులోని రేంజ్ కార్యాలయం నుంచి ఆయన బుధవారం ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పుగోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సమాజానికి చేటు చేసే అరాచక శక్తులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దిశ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసిన మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్స్టేషన్ పరిధిలోనూ గ్రామ సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) సేవలను వినియోగించుకుంటూ మహిళలపై నేరాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తలు వహించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సైబర్ కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్స్పాట్లను గుర్తించి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శాంతిని నెలకొల్పేలా చూడాలన్నారు. ఈ నెల 13న మెగా లోక్ అదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులకు సంబంధించి కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులను డీఐజీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్కుమార్, అంబేద్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సుధీర్కుమార్రెడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, అదనపు ఎస్పీలు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోలు పాల్గొన్నారు.

ప్రాణదాత

- అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ
- ప్రమాదంలో గాయపడిన యువకుడు
- బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించిన వైద్యులు
- అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



అవయవదానం చేసిన వల్లుపు శ్రీరాములు (ఫైల్)

తాడేపల్లిరూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. తాను తనువు చాలించినా మూడు కుటుంబాల్లో ఆనందాలు నింపాడు. మణిపాల్ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సింగ్నగర్కు చెందిన వల్లుపు శ్రీరాములు(23) సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమావశాత్తు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు మణిపాల్ హాస్పిటల్కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీరాములుకు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో శ్రీరాములు భార్య వసంత, తండ్రి ఏడు కొండలు, తల్లి సుశీల అవయవ దానానికి అంగీకరించారు. శ్రీరాములు కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్లో అవసరమైన వారికి ట్రాన్స్ప్లాంటేషన్ చేశామని, మరొక కిడ్నీని ట్రాన్స్ప్లాంటేషన్ నిమిత్తం గుంటూరులోని వేదాంత హాస్పిటల్కు తరలించామని వైద్యులు తెలిపారు. అవయవదానానికి ముందుకు వచ్చినందుకు దాత కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

వెండి తాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం విజయవాడకు చెందిన గూడూరు మనోజ్, కౌశిక్లు రూ.15,111 విరాళంగా ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. విరాళం నగదును ఆలయంలోని శ్రీఅంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాణా బుధవారం పరిశీలించారు. ఈ యజ్ఞానికి వచ్చే భక్తులు, ప్రముఖులకు భద్రత, రక్షణ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని స్టేడియం పరిసరాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.